క్లుప్తంగా

నేడు రెండు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం

హనుమంతునిపాడు: మండలంలోని కూటాగుండ్ల, ముప్పాళ్లపాడు గ్రామ పంచాయతీలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కూటాగుండ్ల, రాత్రి 7 గంటలకు ముప్పాళ్లపాడు పంచాయతీలో పర్యటిస్తారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

తగిన పత్రాలు లేకుండా నగదు తరలించడం నేరం



మలినేని కాలేజీ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సెబ్ సీఐ నరహరి

సింగరాయకొండ(మర్రిపూడి)/జరుగుమల్లి: ఎన్నికల నిబంధనల నేపథ్యంలో తగిన పత్రాలు లేకుండా అధిక మొత్తంలో నగదు తరలించడం నేరమని సెబ్ సీఐ నరహరి స్పష్టం చేశారు. బుధవారం తన సిబ్బందితో కలిసి సింగరాయకొండ మండల పరిధిలో జాతీయ రహదారిపై పెరల్ డిస్టిలరీ కంపెనీ, కందుకూరు రోడ్డులోని మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో, పొన్నలూరు మండలంలోని చింతలపాలెం, జరుగుమల్లి మండలంలోని చిరికూరపాడు చెక్ పోస్టులను బుధారం తనిఖీ చేశారు. పలు చెక్‌పోస్టుల వద్ద సీఐ వాహనాలు తనిఖీ నిర్వహించి సిబ్బందికి సూచనలిచ్చారు. అక్రమంగా మద్యం రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ



వెలిగండ్లలో పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ ఇస్తున్న ఆర్‌డీఓ జాన్ ఇర్విన్

వెలిగండ్ల: ఎన్నికల విధులకు హాజరైన ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని కనిగిరి ఆర్‌డీఓ పాలపర్తి జాన్‌ఇర్విన్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌పై బుధవారం పోస్టల్ బ్యాలెట్ టీం, హోమ్ ఓటింగ్ టీంలకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, ఇతర రాష్ట్రాల్లో ఉండే ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్ కింద 85 ఏళ్లు దాటిన వృద్ధులు, 50 శాతం కంటే ఎక్కువ ఉన్న వికలాంగులకు ఇంటి వద్దనే ఓటింగ్ చేసుకునే అవకాశం ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి నిర్వహించాలన్నారు.

నలుగురు జూదరులు అరెస్టు

జరుగుమల్లి: మండల పరిధిలోని కె.బిట్రగుంట రైల్వే బ్రిడ్జి వద్ద బుధవారం కోడి పందెం ఆడుతున్న నలుగురిని సెబ్ సీఐ నరహరిరావు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి మూడు కోళ్లు, రూ.11,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. నిందితుల తోపాటు నగదును జరుగుమల్లి పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం



టంగుటూరులో స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సై

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని గుంతచెన్నంపల్లెలో అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..గుంతచెన్నంపల్లెలో వ్యక్తి మద్యం బాటిళ్లు కలిగి ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు నిఘా ఉంచి మద్యం బాటిళ్లను తరలిస్తున్న కె.శ్రీరాములును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నా, తరలిస్తున్నా, పేకాట, కోళ్ల పందాలు నిర్వహిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై ప్రేమ్‌కుమార్ కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం

టంగుటూరు: మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాసరావు టంగుటూరులోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద అక్రమంగా కలిగి ఉన్న 10 క్వార్టర్ సీసాలను సీజ్ చేశామని ఎస్సై నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు. తనిఖీలో సిబ్బంది అనిల్ పాల్గొన్నారు.

కొండపి అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వండి



మిట్టపాలెంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్



మంత్రిని గుర్రంపై ఊరేగిస్తున్న గ్రామస్తులు

● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్

కొండపి(మర్రిపూడి): ఒక్క అవకాశం ఇస్తే కొండపి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొండపి మండలం మిట్టపాలెం, ముప్పవరం గ్రామ పంచాయతీల్లో బుధవారం రాత్రి పల్లె పల్లెకు సిద్ధం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాటు జనరంజకంగా, సుభిక్షంగా పరిపాలించారని కొనియాడారు. జగనన్న పాలనకు వైనాట్ 175 కష్టమేమీ కాదన్నారు. 2014లో చంద్రబాబు రుణాలు మాఫీ చేస్తామని రైతులు, అక్కచెల్లెమ్మలను మోగిగించిన తీరును గుర్తు చేశారు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం కరోనా కష్టకాలంలో కూడా సాకులు చెప్పకుండా నవరత్నాలు పథకాలను అమలు చేశారని కొనియాడారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని మంత్రి సురేష్ హామీ ఇచ్చారు. తాను నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన 3 నెలల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. నియోజకవర్గంలో 122 మందికి రూ.1.15 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పార్టీలకు అతీతంగా అందించానన్నారు. అవసరమైన చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, నూతన స్తంభాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించానని పేర్కొన్నారు. యువత కోసం మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇప్పించానన్నారు. కొండపి మండలంలో రోడ్డు వేయించానన్నారు. అంతేకాక నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సుమారు 2 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించానని తెలిపారు.

అవినీతిపరుడు అవసరమా?

ఎమ్మెల్యే స్వామిని రెండుసార్లు గెలిపించినా చేసిన అభివృద్ధి శూన్యమని మంత్రి సురేష్ ఎద్దేవా చేశారు. నీరు–చెట్టు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు.. ఇలా వేటినీ వదలకుండా ఎమ్మెల్యే స్వామి, ఆయన అనుచరులు కోట్లాది రూపాయల ప్రజా ధనం దోచుకున్నారని ఆరోపించారు. టీడీపీ జమానాలో జన్మభూమి కమిటీలే రాజ్యమేలాయని, అరకొర పథకాలు పచ్చ చొక్కాలకే దక్కాయన్నారు. చంద్రబాబు తీరుతో అర్హులైన పేదలు మరింత పేదరికంలోకి నెట్టివేయబడ్డారని చెప్పారు. టీడీపీ పాలనలో పనుల కోసం ప్రజలు జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగితే.. జగనన్న పాలనలో సచివాలయ సిబ్బంది ప్రజల చెంతకే వెళ్లి పథకాలు అందించారన్నారు. మంచి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కొండపి అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మిట్టపాలెం గ్రామ ఉపసర్పంచ్ మండవ మాలకొండయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు మంత్రికి అఖండ స్వాగతం పలికి గుర్రంపై ఊరేగించారు. ముప్పవరంలోనూ మంత్రికి ఘనస్వాగతం లభించింది. పార్టీ మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగం, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గోగినేని వెంకటేశ్వరరావు, బొక్కిసం ఉపేంద్ర, మారెడ్డి వెంకటాద్రి, మాదాల సుబ్బారావు, ముప్పనేని మధు, చింతల వెంకటేశ్వర్లు, పూసపాటి నరసారెడ్డి, మోటుపల్లి గోవింద కృష్ణమూర్తి, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన బేళ్లు వేలానికి తీసుకురావాలి



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు



కొండపిలో రైతులకు సూచనలిస్తున్న సునీల్‌కుమార్

టంగుటూరు: రైతులందరూ మార్కెట్‌కు అనుగుణంగా గ్రేడింగ్ చేసిన నాణ్యమైన పొగాకు బేళ్లు వేలానికి తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం కె.ఉప్పలపాడు క్లస్టరు గ్రామాల రైతులు 964 బేళ్లను వేలానికి ఉంచగా 875 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.231, కనిష్ట ధర రూ.220, సరాసరి ధర రూ.228.51 పలికిందని నిర్వహణాధికారి వివరించారు.

729 పొగాకు బేళ్ల కొనుగోలు

కొండపి(మర్రిపూడి): కొండపి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 729 బేళ్లు కొనుగోలైనట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. కొండపి మండలం మూగచింతల, గుర్రప్పడియ, నెన్నూరుపాడు, పొన్నలూరు మండలం కె.అగ్రహారం, జరుగుమల్లి మండలం సతుకుపాడు గ్రామాల నుంచి 929 బేళ్లు వేలానికి రాగా 200 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయన్నారు. గరిష్ట ధర కేజీ రూ.232, కనిష్ట ధర రూ.220, సరాసరి ధర రూ.228.61 పలికిందని వివరించారు. రైతులు నాణ్యమైన బేళ్లను వేలానికి తీసుకురావాలని సూచించారు.

వివాహ వేడుకల్లో దద్దాల



వివాహ వేడుకల్లో పాల్గొన్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: పట్టణంలోని పలు వివాహ వేడుకల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ పట్టణంలోని బేదం శెట్టివారి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని పాతపాడులో ద్వారణీల వారి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ సాయికుమార్

పామూరు: సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కనిగిరి డీఎల్‌డీఓ బీవీఎస్ సాయికుమార్ అన్నారు. పామూరు 2, 3, 4 సచివాలయాల్లో మంగళవారం సిబ్బంది లేరని, సచివాలయ సిబ్బంది కార్యాలయానికి వస్తున్న వారిపట్ల వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని మండలంలోని నుచ్చుపొద ఉపసర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తక్షణం విచారణ చేయాలని డీఎల్‌డీఓను ఆదేశించారు. ఈమేరకు బుధవారం సచివాయాలను డీఎల్‌డీఓ సాయికుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పామూరులోని 4 సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారిపట్ల దురుసుగా ప్రవర్తించవద్దని, పని కోసం పలుమార్లు తిప్పుకోవద్దని చెప్పామని అయినా ఇలాంటి ఫిర్యాదులు రావడం బాధాకరమని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సిబ్బంది పనితీరు మార్చుకోవాలని ప్రతిరోజు సచివాలయ సిబ్బంది విధిగా ఉదయం, సాయంత్రం గ్రూప్ ఫొటోను తనకు గ్రూపులో పంపాలని ఆదేశించారు. గత నెలరోజుల వ్యవధిలో విధులకు అలస్యంగా హాజరవుతున్న వారిపై అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో భాగంగా ఫీల్డ్‌కు వెళ్లే సమయంలో పంచాయతీ కార్యదర్శికి చెప్పడంతో పాటు మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదుచేయాలని, విధిగా యూనిఫాం ధరించాలని సూచించారు. ఎన్నికల సందర్భంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధులపట్ల అసత్వం ప్రదర్శిస్తే తగిన మూల్యం తప్పదన్నారు. విచారణపై కలెక్టర్‌కు నివేదిక అందించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ పల్లెల పుట్టారెడ్డి, ఈఓపీఆర్‌డి శ్రీనివాసరావు, కేటీవీ నరసింహారావు, పీఎస్‌లు బ్రహ్మానందరెడ్డి, రజనీకాంత్, బ్రహ్మయ్య, పారా మురళి, అన్ని విభాగాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద బాధిత కుటుంబ సభ్యులు

కందుకూరు రూరల్: మండలంలోని మోపాడు గ్రామం వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డి.లక్ష్మి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు కందుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ప్రమాదానికి కారణమైన పొగాకు చెక్కుల ట్రాక్టర్ యాజమానిని అరెస్ట్ చేయాలని, నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని ఎస్సై నరేష్‌ను కోరారు. చట్టం ప్రకారం వారిపై కేసు నమోదు చేశామని, ట్రాక్టర్ ఇన్సూరెన్స్ ఉంటే దాన్ని పరిశీలిస్తున్నట్లు ఎస్సై బాధితులకు తెలిపారు. నిరుపేద కుటుంబమైన లక్ష్మి భర్తకు అనారోగ్యం, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారని ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు



పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



హనుమంతునిపాడు కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



ఉలవపాడు హైస్కూల్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

మర్రిపూడి: మండల కేంద్రమైన మర్రిపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. పరీక్షలు ప్రశాంతంగా సాగడంతో విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొట్టారు. స్నేహితులకు వీడ్కోలు పలికారు. చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్షకు 321 మందికిగాను 317 మంది హాజరైనట్లు చీఫ్‌లు దశరథరామిరెడ్డి, పి.శ్యాంసన్ తెలిపారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

హనుమంతునిపాడు: మండలంలో పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు ఎస్సై కె.శివనాగరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరి రోజు పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ మర్రి శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు ఉన్నాయా లేదా పరిశీలించారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

గుడ్లూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 355 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. పది పరీక్షలు ముగియడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చి ఆనందంతో కేరింతలు కొడుతూ వెళ్లారు.

ఉలవపాడు: మండల పరిధిలో పదో తరగతి పరీక్షలు ముగిశాయి. గత పదిరోజులుగా మండల పరిధిలోని 5 కేంద్రాలలో పరీక్షలు పకడ్బందీగా విద్యాశాఖ నిర్వహించింది. మండలంలో మొత్తం 667 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 5 సెంటర్లలో 12 మంది చీఫ్‌లు, 40 మంది సిబ్బంది ఎలాంటి అవకతవకలు జరగకుండా పరీక్షలు జరిపారు. పోలీస్ శాఖ సహాయంతో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించారు. చివరి రోజు సోషల్ పరీక్ష అయిపోవడంతో విద్యార్థులు ఎంతో సంతోషంగా పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. ఇప్పటి వరకు పరీక్షల ఒత్తిడితో ఉన్న విద్యార్థులు చివరి రోజు పరీక్ష అయిపోయిన తరువాత హుషారుగా ఆనందం వ్యక్తం చేశారు.

రంగారావును పరామర్శించిన బుర్రా



రంగారావును పరామర్శిస్తున్న బుర్రా

కందుకూరు: అనారోగ్యంతో బాధపడుతూ ప్రస్తుతం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వాసవీనగర్ అధ్యక్షుడు, ఆర్య వైశ్య నాయకుడు రంగారావును వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ బుధవారం హాస్పిటల్‌లో పరామర్శించారు. బంధువులను అడిగి రంగారావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రంగారావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన చికిత్స అందించాలంటూ డాక్టర్‌లకు సూచించారు.

నలుగురు జూదరుల అరెస్టు

గుడ్లూరు: పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు జూదరులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని తెట్టులో మామిడి తోటల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణరావుతన సిబ్బందితో కలసి దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5040 స్వాధీనం చేసుకొని కందుకూరు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు చెప్పారు.

కూలీలందరికీ పనులు కల్పించాలి

గుడ్లూరు: కూలీలందరికీ పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని ఏపీఓ అబ్దుల్లా అన్నారు. స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల ద్వారా గుర్తించిన పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ మేట్ల సహకారంతో పనులు చేయించాలన్నారు. మస్టర్లలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ప్రతి కూలీకి రూ.272 కూలి పడేలా కొలతల ప్రకారం పనులు చేయించాలన్నారు. ఉద్యానవన పంటలు ఎక్కువ సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

1లోగా దరఖాస్తు చేసుకోండి

ఉలవపాడు: ప్రైవేట్ పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు ఏప్రిల్ 1 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు ప్రసాదరావు, రమణయ్య తెలిపారు. గతంలో ఈ నెల 25 వరకు ఉన్న చివరి తేదీ నుంచి 1 వరకు పొడిగించామన్నారు. 1వ తరగతిలో ఉచితంగా ప్రవేశానికి తల్లితండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.



ఇంటింటి ప్రచారంలో దద్దాల మంజు భార్గవి, చైర్మన్ గఫార్, ఏఎంసీ మాజీ చైర్మన్ సరితారెడ్డి

వైఎస్సార్ సీపీ హయాంలోనే ముస్లింల అభ్యున్నతి



పీసీపల్లిలో మాట్లాడుతున్న బొర్రారెడ్డి



కూటాగుండ్లలో ఎన్నికల ప్రచారంనిర్వహిస్తున్న నేతలు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ హయాంలోనే ముస్లిం మైనార్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం జరిగిందని వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ సతీమణి దద్దాల మంజు భార్గవి అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో కౌన్సిలర్ సయ్యద్ రిజ్వానా ఖాలక్ ఆధ్వర్యంలో ఇంటింటికి వైఎస్సార్ సీపీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల మంజు భార్గవి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు నాల్గు శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌దేనన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అందచేసినట్లు చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. సంక్షేమ లబ్ధిదారులంతా త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి, వేయించి ఎమ్మెల్యేగా దద్దాల నారాయణ యాదవ్‌ను, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడింది వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే నన్నారు. వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణ, తమ్మినేని సుజాతరెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, పండ్ల ఖాదర్, చింతంగుంట్ల కిషోర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సూరసాని మోహన్ రెడ్డి, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు రసూల్, ప్యారీజాన్, కౌన్సిలర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

పీసీపల్లి: రానున్న ఎన్నికల్లో కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొర్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు సమయం లేదు కనుక కార్యకర్తలంతా ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిల గెలుపునకు కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ ఓకేరెడ్డి, ఎంపీపీ జనన్య , తదితరులు ఉన్నారు.

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయని మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి అన్నారు. మండలంలోని కూటాగుండ్ల పంచాయతీ పరిధిలోని నరవ గోపాలుపురం, ఎస్సీ కాలనీలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులకు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంట్లో లక్షల రూపాయల లబ్ధి జరిగిందన్నారు. యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, గాయంవారిపల్లి సర్పంచ్ గాయం రామక్రిష్టారెడ్డి, ఆస్ట్రేలియా కన్వీనర్ చింతలచెరువు సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు ఎస్ ధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంఘ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, గృహ సారధుల కన్వీనర్ మద్ది తిరుపతయ్య, సర్పంచ్ గాలం రామక్రిష్ణ, మాజీ సర్పంచ్ బైనబోయిన కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరులో కేంద్ర బలగాల కవాతు



బింగినపల్లిలో బీఎస్ఎఫ్ దళాలతో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న సీఐ రంగనాథ్



గుడ్లూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

గుడ్లూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని తెట్టు, గుడ్లూరు గ్రామాల్లో గుడ్లూరు సర్కిల్ సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో కేంద్రసాయుధ బలగాలు బుధవారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి ప్రజలంతా పోలీసులకు సహకరించాలని అన్నారు. ఓటర్లంతా ఓటు హక్కును స్వచ్ఛందంగా నిర్వహించుకోవచ్చన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. కవాతులో ఎస్సై లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించండి

సింగరాయకొండ(మర్రిపూడి): సార్వత్రిక ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ దాచేపల్లి రంగనాథ్ అన్నారు. సింగరాయకొండ మండలంలో సమస్యాత్మక గ్రామాలైన బింగినపల్లి, పెద్దన్నబోయిన పాలెం, ఊళ్లపాలెం, దేవలం పల్లెపాలెం, బేసిన్‌పల్లెపాలెంలో బీఎస్ఎఫ్ దళాలతో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ రంగనాథ్ మాట్లాడుతూ.. ఈసారి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలన్నదే ఎన్నికల కమిషన్ ముఖ్య ఉద్దేశమని, సమస్యాత్మక గ్రామాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఓటరు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎస్సై టి.శ్రీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.